రేపు యోగా బ్యాచ్ ప్రారంభం

ప్రజాశక్తి-కడప అర్బన్ : పటేల్ రోడ్డులోని మిత్ర యోగా సెంటర్‌లో 30 రోజుల పాటు నిర్వహించబడే యోగా శిక్షణ కొత్త బ్యాచ్‌ను 2026, జనవరి 2వ నుంచి ప్రారంభిస్తున్నట్లు యోగా నిపుణులు డాక్టర్ కల్పన, డాక్టర్ ఆర్ రంగనాథరెడ్డి ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణలో రోగనిరోధక శక్తిని పెంపొందించుకోవడానికి, మానసిక ఒత్తిడిని తగ్గించుకోవడానికి, అధిక బిపి, డయాబెటిస్, ఒబెసిటీ, థైరాయిడ్, పిసిఒడి వంటి దీర్ఘకాలిక సమస్యల నివారణకు యోగా సాధన చేయు స్థాయిని పేర్కొన్నారు. ఉపిరితిత్తుల సామర్థ్యాన్ని పెంపొందించుకోవడానికి అవసరమైన యోగాసనాలు, ప్రాణాయామం, షట్ క్రియలు, ధ్యానం వంటి యోగ ప్రక్రియలను సాధన చేయిస్తామని తెలిపారు. శిక్షణ ఉదయం 5.45 గంటల నుంచి 7.00 గంటల వరకు మొదటి బ్యాచ్, ఉదయం 8.30 గంటల నుంచి 10 గంటల వరకు మహిళలకు రెండో బ్యాచ్, సాయంత్రం 5.00 గంటల నుంచి 6.30 గంటల వరకు మూడో బ్యాచ్ ఉంటుందని పేర్కొన్నారు. వివరాలకు 9848861206, 7013238986 నంబర్లను సంప్రదించవచ్చని తెలిపారు.

కొత్త ఆశలతో..

కొత్త ఆశలతో నూతన వసంతం పలకరిస్తోంది. కోటి ఆశలతో కొత్త ఉషస్సులతో స్వాగతం పలుకుతోంది. 2024 సార్వత్రిక ఎన్నికల అనంతరం రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కూటమి నాయకత్వ వాగ్దానాల అమలుపై నిరాశాపూరిత వాతా వరణం నెలకొంది. సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో జిల్లాలో ప్రభుత్వం ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేస్తామని ఇచ్చిన హామీ కాగితాలకే పరిమితమైంది. జిల్లా పునర్విభజనను శాస్త్రీయంగా చేపడతామని ఇచ్చిన హామీని తుంగలో తొక్కింది. అన్నమయ్య జిల్లా అస్థిత్వాన్ని ప్రశ్నార్థకంగా మార్చింది. 2026 సంవత్సరం కొత్తఆశలు రేపుతోంది. రైతుల ఆశలను, ఆకాంక్షలను నెరవేర్చడానికి కూటమి సర్కారు ముందుకు వస్తున్నప్పటికీ, ఉసురు తీసుకున్న రైతులకు, సోలార్ యాజమాన్యాల నుంచి పరిహారం అందని పరిస్థితి ఏర్పడింది. జిల్లాలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు మొదలుకుని సాగునీటి ప్రాజెక్టులకు స్పష్టత చాన్నళ్ల వరకు సమస్యలు వేధిస్తుండడం ఆందోళన కలిగిస్తోంది. ఫలితంగా గండికోట, మైలవరం, పైడిపాలెం నిర్వాసితులకు పరిహారం మొదలుకుని చిత్రావతి, బ్రహ్మసాగర్ ప్రాజెక్టుల లీకేజీలను అధిగమించలేని పరిస్థితి నెలకొంది. కొత్త ఏడాదిలో సంక్షేమ పథకాలు అమలు నేపథ్యంలో జిల్లా వాసుల ఆశలు, ఆకాంక్షలు అంచనాల్ని మించి ఉన్నాయని చెప్పవచ్చు.

- సోలార్ యాజమాన్యాల ఇష్టారాజ్యం
- కాగితాల్లోనే ఉక్కు పరిశ్రమ ఏర్పాటు
- పునర్విభజనలో 'అన్నమయ్య' గల్లంతు
- అమలుకు నోచని సిఎం హామీలు

కడప ఉక్కుకు శంకుస్థాపన చేస్తున్న చంద్రబాబునాయుడు (ఫైల్‌ఫొటో)

ప్రజాశక్తి - కడపప్రతినిధి

జిల్లా ప్రగతి నత్తనడకన సాగుతోంది. ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు బాధ్యతలు చేపట్టడంతో ప్రగతి పరుగు పెడుతుందని ప్రజానీకం ఆశలు పెంచుకుంది. కూటమి అడుగులను గమనిస్తే ఎన్‌డిపిఎస్ కోర్టు, ఎంఎస్‌ఎంఇ తరలింపు, అన్నమయ్య జిల్లా అస్థిత్వాన్ని ప్రశ్నార్థకం చేయడం నిరు త్సాహాన్ని కలిగిస్తోంది. ఇటీవలి జిల్లా పర్యటనలో భాగంగా 2025 ఆర్థిక సంవత్సరం ముగింపు నాటికి కడపకు తాగునీటి సదుపాయాన్ని అందిస్తానని హామీ నిర్దేశిస్తోంది. కడప జిల్లాలో ఉక్కు పరిశ్రమ పనులు మొదలుకుని రిమ్స్ సూపర్ స్పెషాలిటీ పోస్టుల భర్తీ, నియామకాలు పూర్తి చేయడం సాకారం కావడం లేదు. జిల్లాలో రాజోలి, జొలదరాశి, కుందూ లిఫ్టు, జిఎన్‌ఎస్ఎస్-2 నుంచి రాయచోటికి లిఫ్టు, వెలిగల్లు లిఫ్టు మొదలగు పనులు ప్రతిపాదన దశను దాటడం లేదు. యోగి వేమన యూనివర్సిటీ నిధుల కొరత, కొత్తకోర్సులు ఏర్పాటు, ఫ్యాకల్టీ నియామకాలు, నందలూరులో ఉద్యానవన యూనివర్సిటీ ఏర్పాటు, జిఎన్‌ఎస్ ఎస్‌ఫేజ్-2, ఒంటిమిట్ట కోదండ రామాలయ మాస్టర్‌ప్లాన్, ఐటి పార్కు మొదలగు అభివృద్ధి పనులు పూర్తి చేయాల్సి ఉంది. 2014 రాష్ట్ర విభజన చట్టంలో పేర్కొన్న విధంగా కేంద్రం సెయిల్ ఆధ్వర్యంలో ఇంటిగ్రేటెడ్ ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాల్సి ఉంది. కేంద్రం మొండివైఖరిని అవలంబించడంతో రాష్ట్ర ప్రభుత్వమే చొరవ తీసుకుని శంకుస్థాపన చేసింది. మూడేళ్లలో రూ.15 వేల కోట్ల వ్యయంతో నిర్మించనున్నట్లు పేర్కొంది. 2026 పదేళ్ల గడువున్నప్పటికీ సాకారం కావడం లేదు. కొప్పర్తి పారిశ్రామికవాడకు పర్యావరణ అనుమతి లభించకపోవడంతో పారిశ్రామిక ప్రగతిలో వెనుకబడింది. ఫలితంగా యువత పొట్టచేతబట్టుకుని గల్ఫ్, పశ్చిమ దేశాలకు వలస వెళ్లింది. దేశీయంగా నిరుద్యోగం పెరిగిపోతోంది. వ్యవసాయ రంగాభివృద్ధిలో కీలకమైన గండికోట, తెలుగుగంగ కాల్వల వెడల్పు పనులు, అన్నమయ్య రిజర్వాయర్ పునరుద్ధరణ పనులు, జిఎన్‌ఎస్ఎస్-2 పనుల మొదలుకుని, ఉమ్మడి జిల్లాలోని 15 రిజర్వాయర్ల పరిధిలో ఏ ఒక్క ప్రాజెక్టు చివరి ఆయకట్టు వరకు నీరందించే పరిస్థితి కనిపించ లేదు. ఫలితంగా రిజర్వాయర్లలో నీళ్లు నిలిపినప్పటికీ సద్వినియోగం చేసుకునే అవకాశం లేకుండా పోతోంది. ఈ ఏడాది శ్రీశైలం రిజర్వాయర్ నిండిన నేపథ్యంలో గండికోట, మైలవరం, పైడిపాలెం, చిత్రావతి, బ్రహ్మసాగర్, ఎస్ఆర్-1, ఎస్ఆర్-2 వంటి ప్రాజెక్టుల్లో పూర్తి స్థాయిలో నీటిని నిల్వ చేసిన సంగతి తెలిసిందే. అన్నమయ్య, పింఛా, ఎగువ సగిలేరు వంటి ప్రాజెక్టుల మరమ్మతులు ఎప్పటికి సాకారమవ్వ తాయో తెలియని పరిస్థితి ఆందోళన కలిగిస్తోంది. గండికోట, సోమశిల, పైడిపాలెం, చిత్రావతి, సోమశిల ప్రాజెక్టుల పరిధిలోని నిర్వాసితులకు పరిహారం అందించాల్సిన అవసరం ఉంది. వచ్చే ఏడాది చివరి నాటికైనా అన్నమయ్య పునరుద్ధరణ, కొప్పర్తి, జిఎన్‌ఎస్ఎస్ ఫేజ్-2 పనులకు పర్యావరణ అనుమతుల సమస్య పరిష్కారమైతే ప్రగతి పరుగులు తీయాల్సిన అవసరం ఎంతైనా ఉందనడంలో సందేహం లేదు.

నేటికీ మారని అన్నమయ్య డ్యామ్ దుస్థితి

రోడ్డు భద్రత ఆంక్షలను కఠినతరం చేయాలి

ప్రజాశక్తి - కడప : ప్రజల ప్రాణ భద్రత కోసం చేపడుతున్న రోడ్డు భద్రత చర్యల ఆంక్షలను మరింత కఠినతరం చేయాలని కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి సంబంధితాధికారులను ఆదేశించారు. బుధవారం స్థానిక కలెక్టరేట్‌లోని విసి హాలులో జిల్లా ఆర్అండ్‌బి శాఖ ఆధ్వర్యంలో జిల్లా రహ దారుల భద్రతా సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. సమా వేశానికి కలెక్టర్‌తోపాటు ఎస్‌పి షెల్కే నచికేత్ విశ్వనాథ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అత్యధిక శాతం ప్రజలు రోడ్డు ప్రమాదాల కారణంగానే ప్రాణాలు కోల్పోతున్నారని చెప్పారు. రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకునే అవకాశాలు ఎక్కువగా ఉన్న రహదారులపై ఎన్‌ఫోర్స్‌మెంట్ చర్యలను కఠినతరం చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రధానంగా నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా నగరంలోని ప్రధాన రోడ్లపై యువత బైకు రైడింగ్ విన్యాసాలను చేసే అవకాశం ఉన్నందున అధికారులు ప్రత్యేక దృష్టి సారించి ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించి కేసులు నమోదు చేయాలన్నారు.ప్రజల ప్రాణ భద్రతే ధ్యేయంగా చర్యలు చేపట్టాలన్నారు. యువతకు వాహనాలను కొనిచ్చే తల్లిదండ్రులు కూడా పిల్లలకు బాధ్యతలను గుర్తు చేయాలని సూచించారు. పరిమిత వేగం, రోడ్లపై బాధ్యతగా డ్రైవింగ్ చేయాలని సూచిస్తూ రోడ్డు భద్రతా, ప్రమాదాలను అరికట్టడంలో తల్లిదండ్రులు కూడా సామాజిక బాధ్యతను స్వీకరించాలని తెలిపారు. జాతీయ రహదారుల్లో ఆవసరమైన చోట్ల మాత్రమే యు టర్న్ స్పాట్ లను ఉంచాలని పేర్కొన్నారు. అనవసరమైన ప్రాంతాల్లో స్పీడ్ బ్రేకర్లను వెంటనే తొలగించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సినిమా థియేటర్లలో లఘు చిత్రాల ద్వారా అవగాహన పెంచాలన్నారు. కార్యక్రమంలో రాజంపేట ఎఎస్‌పి మనోజ్ హెగ్డే, కమిటీ మెంబర్ కన్వీనర్ ఆర్ అండ్ బి ఎస్ఇ భాస్కర్ రెడ్డి, డిటిసి వీరరాజు, మున్సిపల్ కమిషనర్ మనోజ్ రెడ్డి, కమిటీ సభ్యులైన రోడ్ సేఫ్టీ ఎన్‌జిఒ జిల్లా అధ్యక్షుడు జి.వి రమణ, వైద్య ఆరోగ్యశాఖ, ఆర్ అండ్ బి శాఖ అధికారులు, విద్యుత్ శాఖల ఎస్ఇలు, మున్సిపల్ కమిషనర్లు, నేషనల్ హైవేస్ అథారిటీ అధికారులు, ట్రాఫిక్, పోలీసు, రవాణా శాఖ అధికారులు, కమీటీ సభ్యులు పాల్గొన్నారు.

ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలి

పారిశ్రామికంగా విస్తృతమైన వనరులు, ఉపాధి అవకాశాలున్న కడప జిల్లాలో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు అవకాశం కల్పించి ప్రోత్సహించాలని కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం రాత్రి కడప కలెక్టరేట్‌లోని బోర్డు మీటింగ్ హాలులో జిల్లా పారిశ్రామిక ఎగుమతులు, ప్రోత్సాహక కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో పారిశ్రామిక రంగాన్ని పటిష్టం చేసి పరిశ్రమల ద్వారా విస్తృత ఉపాధి అవకాశాలను కల్పించేందుకు అన్ని అనుబంధ శాఖలు సమన్వయంతో కృషి చేయాలన్నారు. జిల్లా ఆర్థిక ప్రగతికి ఆయువు పట్టు ఆయన పారిశ్రామిక రంగాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకురావాలన్నారు. కొత్తగా పారిశ్రామిక రంగంలోకి అడుగిడాలనుకున్న వారికి ఆర్థిక ప్రోత్సాహాన్ని అందించేలా బ్యాంకర్లు కూడా సహకరించాలన్నారు.

పోస్టర్లు ఆవిష్కరిస్తున్న డిఇఒ షంషుద్దీన్, జెవివి నాయకులు

చాపకింద నీరులా మత్తు పదార్థాల ముప్పు

ప్రజాశక్తి- కడప అర్బన్

చాప కింద నీరులా మత్తు పదార్థాల ముప్పు విస్తరిస్తోందని డిఇఒ శంషుద్దీన్ పేర్కొన్నారు. జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మత్తు పదార్థాల వల్ల సమాజానికి, ముఖ్యంగా విద్యార్థుల భవిష్యత్తుకు కలుగుతున్న ప్రమాదాలపై అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో రూపొందించిన 'ఉసురు తీస్తున్న మత్తు పదార్థాలు' పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డిఇఒ మాట్లాడుతూ పాఠశాల స్థాయిలోనే మత్తు పదార్థాల ప్రభావం కనిపించడం తీవ్రమైన హెచ్చరిక అని తెలిపారు. విద్యార్థులను కాపాడేందుకు అవగాహన కార్యక్రమాలు, కౌన్సెలింగ్, పర్యవేక్షణ తప్పనిసరిగా అమలు చేయాల్సిన అవసరం ఉందని సూచించారు. ఈ విషయంలో విద్యాశాఖ పూర్తి సహకారం అందిస్తుందని భరోసా ఇచ్చారు. మత్తు పదార్థాలకు 'నో' చెప్పే చైతన్యవంతమైన తరాన్ని నిర్మించాల్సిన అవసరాన్ని మరోసారి గుర్తు చేశారు. జెవివి రాష్ట్ర కమిటీ సభ్యులు రాజశేఖర్ రాహుల్ మాట్లాడుతూ పిల్లలు చదువుకునే వయసులోనే మత్తు పదార్థాలకు బానిసలవడం విద్యా వ్యవస్థకు పెద్ద సవాల్‌గా మారిందని పేర్కొన్నారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సామాజిక సంస్థలు సమిష్టిగా స్పందించినప్పుడే ఈ ప్రమాదాన్ని అడ్డుకోవచ్చని అన్నారు. కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు సమీర్ బాష, ఎడి రామకృష్ణ, జెవివి రాష్ట్ర కమిటీ సభ్యురాలు సరస్వతి, సీనియర్ నాయకులు వెంకటేశ్వర్లు, నగర కమిటీ ప్రధాన కార్యదర్శి నరసింహారెడ్డి, సభ్యులు భాస్కర్, మధుసూధన్, సి.పి.రమణ, కరీముల్లా పాల్గొన్నారు.

6న వైవీయూ బాల్ బ్యాడ్మింటన్ జట్ల ఎంపికలు

ప్రజాశక్తి - కడప అర్బన్

యోగి వేమన విశ్వవిద్యాలయ బాల్ బ్యాడ్మింటన్ జట్ల కోసం డైరెక్ట్ సెలక్షన్ ట్రయల్స్ ఈనెల 6న ఉదయం 9గంటలకు వేమన క్రీడా ప్రాంగణంలో నిర్వహించనున్నట్లు వైవీయూ క్రీడాబోర్డు సెక్రటరీ డాక్టర్ కె. రామసుబ్బా రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సెలక్షన్ ట్రయల్స్‌లో పాల్గొనేందుకు ఆసక్తి కలిగిన క్రీడాకారులు విశ్వవిద్యాలయ అనుబంధ సంస్థలలో చదివి ఉండాలని పేర్కొన్నారు. వయసు 17 - 25 ఏళ్ల లోపు ఉండాలని తెలిపారు. క్రీడాకారులు తమవెంట అవసరమైన సర్టిఫికెట్లతో హాజరుకావాలని తెలిపారు. వివరాలకు 6281689398 నంబర్ ను సంప్రదించాలని పేర్కొన్నారు.

హార్టీకల్చర్ హబ్‌గా కడప అభివృద్ధి

- కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి

ప్రజాశక్తి-కడప

దేశ వ్యాప్తంగా హార్టీకల్చర్ హబ్‌గా వైఎస్ఆర్ కడప జిల్లా అభివృద్ధి చెందుతోందని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు. జిల్లాలో రాజంపేట నియోజకవర్గం కలవడంతో అత్యధిక మండలాలు కలిగిన జిల్లాగా వైఎస్ఆర్ కడప జిల్లా నిలిచిందని చెప్పారు. బుధవారం స్థానిక కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ హాల్‌లో ఎస్‌పి షెల్కే నచికేత్ విశ్వనాథ్, రాజంపేట సబ్ కలెక్టర్ భావన, రాజంపేట ఎఎస్‌పి మనోహర్‌కుమార్‌హెగ్డేతో కలిసి విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన జిల్లాల పునర్విభజనలో భాగంగా అన్నమయ్య జిల్లాలోని రాజంపేట నియోజ కవర్గంలోని రాజంపేట, నందలూరు, వీరబల్లి, సుండుపల్లి మండలాలు కడప జిల్లాలో విలీనమయ్యాయని చెప్పారు. ప్రస్తుతం 40 మండలాలతో రాష్ట్రంలోనే అత్యధిక మండలాలు గల జిల్లాగా నిలిచిందని చెప్పారు. నాలుగు మండలాల్లో విద్యాసంస్థలు, ప్రభుత్వ, ఇతర సంస్థలన్నీ కడప జిల్లాలో పరిధిలోనే పనిచేస్తాయని వివరించారు. రాజంపేటలోని 4 మండలాల్లో పండిచే అరటి, చీనీ, నిమ్మ, మామిడి, బొప్పాయి వంటి పంటలు తోడు కావడంతో కడప జిల్లా హార్టీకల్చర్ హబ్‌గా మారడానికి ఊతమిచ్చిందని చెప్పారు. రాజంపేట రెవెన్యూ డివిజన్‌లో రోజూ యథావిధిగా ప్రభుత్వ సేవలు, సుపరిపాలన అందించాలని అధికారులకు సూచించారు. రెవెన్యూ వ్యవస్థలో ఉన్నటువంటి సమస్యలను మరింత సమర్థవంతంగా పరిష్కరించే దిశగా 'రెవెన్యూ క్లినిక్' అనే విధానాన్ని కొత్త సంవత్సరంలో వచ్చే సోమవారం నుంచి అన్ని రెవెన్యూ డివిజన్ కేంద్రాల్లో, అన్ని మండల కేంద్రాల్లోని తహశీల్దార్ కార్యాలయాల పరిధిలో అమలు చేసేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. రాజంపేటలోని 4 మండలాలకు కూడా స్మార్ట్ కిచెన్ ప్రోగ్రాం పథకాన్ని అమలు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు, మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

రెవెన్యూ డివిజన్ మ్యాప్‌ను చూపుతున్న కలెక్టర్

పార్టీ కోసం అహర్నిశలు కృషి చేస్తాం

- పొలిట్‌బ్యూరో సభ్యులు శ్రీనివాసరెడ్డి

ప్రజాశక్తి-కడప అర్బన్

మీడియాతో మాట్లాడుతున్న శ్రీనివాసరెడ్డి

టిడివి అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తామని టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు ఆర్. శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. బుధవారం ద్వారకానగర్‌లోని ఎమ్మెల్యే కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 12 ఏళ్లుగా పార్టీ అధ్యక్షులుగా పనిచేసే అవకాశం సిఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ తన మీద నమ్మకంతో కల్పించారని పేర్కొన్నారు. పార్టీలో సామాన్య కార్యకర్తగా పనిచేశానని, పార్టీ విజయానికి కృషి చేస్తున్నానని తెలిపారు. దేశంలో ఉన్నతమైన వ్యక్తి సిఎం చంద్రబాబు అన్నారు. జిల్లాలో మహానాడు సూపర్ సక్సెస్ చేశామని తెలిపారు. సిఎంగా జగన్ ఉన్నప్పుడు పులివెందులో పార్టీ కార్యాలయం నిర్మించామని చెప్పారు. భవిష్యత్‌లో పార్టీ కోసం పనిచేస్తామన్నారు. నూతన జిల్లా అధ్యక్షులు భూపేష్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలియజేశారు. రూ. 25 లక్షల కోట్ల పెట్టుబడులు రాష్ట్రానికి మంత్రి లోకేష్ తీసుకొచ్చారని చెప్పారు. ఒంటిమిట్ట, సిద్ధవటం మండలాలను కడపలోనే ఉండాలని సిఎం చంద్రబాబుకు నివేదించానని చెప్పారు. రాజంపేట నియోజకవర్గాన్ని కడప జిల్లాలో కలపడం శుభపరిణామమని తెలిపారు.

భోగా వెంకటసుబ్బయ్య సేవలు ప్రశంసనీయం

ప్రజాశక్తి-ఒంటిమిట్ట

స్థానిక జడ్‌పి ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా దీర్ఘకాలం అంకితభావంతో సేవలందించిన భోగా వెంకటసుబ్బయ్య సేవలు ప్రశంసనీయమని రాజంపేట అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ జగన్‌మోహన్‌రాజు పేర్కొన్నారు. వెంకటసుబ్బయ్య ఉద్యోగ విరమణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థుల వ్యక్తిత్వ వికాసానికి, తెలుగు భాషాభివృద్ధికి భోగా వెంకటసుబ్బయ్య చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. ఉపాధ్యాయ వృత్తికి గౌరవాన్ని తీసుకొచ్చిన వ్యక్తిగా ఆయన సమాజంలో ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్నారని కొనియాడారు. విరమణ అనంతరం ఆయన శాంతియుత జీవితం సుఖసంతోషాలతో వర్థిల్లాలని ఆకాంక్షించారు. అనంతరం ఉపాధ్యాలయుడిని శాలువ, జ్ఞాపికతో సన్మానించారు. కార్యక్రమంలో ఒంటిమిట్ట జడ్‌పిటిసి ముద్దు కృష్ణారెడ్డి, ఎంపిపి లక్ష్మీదేవి, వైస్‌ఎంపిపి గీతాదేవి, ఎంపిపి ప్రతినిధి సాలాబాద్ బుజ్జి, బాషా, ఎంపిటిసిలు వీరాంజనేయరెడ్డి, బొబ్బిలి రాయుడు, ఎస్.వి. రమణ, తుమ్మలకుంట్ల ఈశ్వరయ్య, సుబ్బరాయుడు, రోశయ్య, శ్రీనివాసు రెడ్డి, చింత గింజల సుబ్రహ్మణ్యం, బుడిచెర్ల శ్రీనివాసులు, బి. శ్రీనివాసులు, ఆంజనేయులు, నరసింహులు, మాజీ సర్పంచ్ నరసింహులు పాల్గొన్నారు.

స్ఫూర్తి ప్రదాత బుడ్డా వెంగళ్‌రెడ్డి : మేయర్

ప్రజాశక్తి - కడప అర్బన్

మహాదాత బుడ్డా వెంగళ్‌రెడ్డి చేసిన దాన ధర్మాలు భావితరాలకు స్ఫూర్తిదాయకమని నగర మేయర్ పాకా సురేష్ కుమార్ అన్నారు. బుధవారం జడ్‌పి ఆవరణంలోని ప్రేమాలయం నిరాశ్రయుల వసతి గృహంలో రేనాటి సూర్యచంద్రుల విగ్రహ కమిటీ ఆధ్వర్యంలో బుడ్డా వెంగళ్‌రెడ్డి 125వ వర్ధంతి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ కోవెలకుంట్ల తాలూకాలోని ఉయ్యాలవాడ గ్రామం ఒకప్పుడు కడప జిల్లాలోనే ఉండేదన్నారు. రేనాటి సూర్యచంద్రులుగా పిలవబడే ఉయ్యాలవాడన రసింహారెడ్డి, బుడ్డా వెంగళ్‌రెడ్డి విగ్రహాలు కడపలో ఏర్పాటు కాకపోవడం విచారకరమన్నారు. వారి విగ్రహాల ఏర్పాటుకు తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు.అనంతరం నిరాశ్రయులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ ఛైర్మెన్ హరీంద్రనాథ్, డాక్టర్ రామాంజులరెడ్డి, వైసిపి ఎస్ఇసి సభ్యులు సంబటూరు ప్రసాద్‌రెడ్డి, ఎస్‌సి సెల్ మాజీ చైర్మన్ సి.హెచ్. వినోద్ కుమార్, కార్పొరేటర్ బాలస్వామిరెడ్డి పాల్గొన్నారు.

భూపేష్‌రెడ్డిని కలిసిన నాయకులు

ప్రజాశక్తి - కలసపాడు

మండలంలోని టిడిపి నాయకులు బుధవారం జమ్మలమడుగులోని జిల్లా టిడిపి అధ్యక్షులు బుధవారం భూపేష్‌నుడ్డిని తన స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. రాబోయే సంవత్సరంలో పార్టీ మరింత బలపడే విధంగా కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎపిఎస్ఆర్టీసీ రోడ్డు రవాణా డైరెక్టర్ సాధనకారి రంతు, కలసపాడు టిడిపి మండల పార్టీ అధ్యక్షులు గోపవరం వెంకటరామిరెడ్డి, టిడిపి మండల ఉపాధ్యక్షులు పట్టాభిరెడ్డి , ఎగువ సగిలేరు నీటి సంఘం అధ్యక్షులు కొత్తపల్లె చిన్న రంగారెడ్డి, రా చెరువు నీటి సంఘం అధ్యక్షుడు అన్నా రెడ్డి శ్రీనివాసులు రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

భూపేష్‌రెడ్డిని సన్మానిస్తున్న టిడిపి నాయకులు

నీట్ పీజీలో 'గురుకులం' విద్యార్థిని ప్రతిభ

ప్రజాశక్తి-చక్రాయపేట

కరిష్మాకు స్వీట్లు తినిపిస్తున్న తల్లిదండ్రులు

కడప జిల్లాలో వెనుకబడిన ప్రాంతమైన చక్రాయపేట మండలంలోని ఉప్పల వాండ్లపల్లె గ్రామానికి చెందిన షఫీ, పర్వీన్ ప్రథమ కుమార్తె కరిష్మా నీట్ పీజీ పరీక్షలలో ప్రతిభ కనబరిచింది. వేంపల్లెలోని ఉర్దూ గురుకులం పాఠశాలలో ప్రాథమిక, ఉన్నత విద్యను అభ్యసించిన కరిష్మా నీట్ పీజీలో ప్రతిభ కనపరిచి విజయవాడలోని సిధార్థ వైద్య కళాశాలలో ఒబిజి సీటు సాధించింది. కరిష్మా తిరుపతి ఎస్‌విఎంసిలో 2018-2024లో ఎంబిబిఎస్ పూర్తి చేసింది. 2025 పీజీ నీట్ పోటీ పరీక్షలో అల్ ఇండియాలో 13 వేలు, రాష్ట్రంలో 732 ర్యాంక్ సాధించి ఒబిజి(గైనకాలజిస్ట్) సిటు సాధించింది. దీంతో కరిష్మాకు విద్యను అందించిన ఉపాధ్యాయులతోపాటు గ్రామంలో పెద్దలు ఆనందం వ్యక్తం చేశారు. కరిష్మాను ప్రతి ఒక్కరూ ఆదర్శం తీసుకొని విద్యలో ముందు స్థాయికి వెళ్లాలని విద్యార్థులకు సూచించారు.

తల్లిదండ్రుల ప్రోత్సాహంతోనే..

తల్లిదండ్రులు ప్రోత్సహంతో నేను ఈవిజయం సాధించారు. నీట్‌లో ఆలిండియాలో 13 వేల ర్యాంకు సాధించడం ఆనందంగా ఉంది. నాకు వచ్చిన అవకాశాన్ని పేదలకు వైద్య సేవలను అందించేందుకు ఉపయోగిస్తాను.

- కరిష్మా, విద్యార్థిని

రేపటి నుంచి పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ

ప్రజాశక్తి - కాసినాయన

రైతులకు కొత్త పట్టాదారు పాసు పుస్తకాలు ఈనెల 2 నుంచి పంపిణీ చేయనున్నామని తహశీల్దార్ వెంకటసుబ్బయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని ఓబులాపురం, పిట్టిగుంట, వంకమర్రి వెంగలంపల్లె గ్రామాలలో రీసర్వే పూర్తయిన సందర్భంగా శుక్రవారం నుంచి గ్రామసభలుంటాయని పేర్కొన్నారు. ముందుగా 2న ఓబులాపురం, 3న పిట్టిగుంట, 5న వంకమర్రి 6న వెంగళంపల్లి గ్రామాలలో కొత్త పట్టాదారు పాసుపుస్తకాలు పంపిణీ ఉంటుందన్నారు. రైతులు తమ వద్దనున్న పాత పట్టాదారు పాసుపుస్తకాలు తీసుకురావాలని పేర్కొన్నారు.

భూ సమస్యలను వెంటనే పరిష్కరించాలి

ప్రజాశక్తి -కాశినాయన

గ్రామాలలోని పేదల భూ సమస్యలను రెవెన్యూ అధికారులు త్వరగా పరిష్కరించి వారికి న్యాయం చేయాలని ఆ దిశలో రెవెన్యూ అధికారులు పనిచేయాలని బద్వేల్ మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ తెలుగుదేశం పార్టీ కాశినాయన మండల నాయకుడు బసిరెడ్డి రవీంద్రారెడ్డి పేర్కొన్నారు బుధవారం ఆయన మాట్లాడుతూ రెవెన్యూ అధికారులు గ్రామాలలో గ్రామసభలు పెట్టి భూ సమస్యలు పరిష్కరించాలని, ప్రభుత్వం పేదల కోసం చిత్తశుద్ధితో పనిచేస్తుందని, ఈనెల 2 నుంచి గ్రామాలలో జరిగే గ్రామసభలలో కొత్త పట్టాదారుల పాస్ పుస్తకాలను తీసుకోవాలని పేర్కొన్నారు. ఓబులాపురం, పిట్టిగుంట, వంకమర్రి, వెంగళంపల్లి గ్రామాలలో రీసర్వే పూర్తయిందని, అక్కడ పంపిణీ చేస్తారని తెలిపారు. మిగిలిన గ్రామాలలోనూ త్వరలో కొత్త పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ చేస్తారని పేర్కొన్నారు. పేదల అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలతో ముందుకు వెళుతుందని పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, బద్వేల్ టిడిపి ఇన్‌ఛార్జి రితీష్‌రెడ్డి, ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీని బద్వేల్ నియోజకవర్గంలో అభివృద్ధి చేస్తున్నామన్నారు

అనాథలకు దుస్తులు అందజేత

ప్రజాశక్తి - కాశినాయన

అనాథలకు, వితంతువులకు క్రిస్మస్, నూతన సంవత్సరం సందర్భంగా అమగంపల్లి సగిలి థామస్ (జూనియర్) పంపిణీ చేశారు. కాశినాయన మండలంలోని అమగంపల్లిలో సుమారు 240 మంది వితంతువులకు చీరలు, 30 మంది తల్లిదండ్రులు లేని పిల్లలకు బట్టలు, ఆట వస్తువులు, స్వీట్స్ పంపిణీ చేశారు. ఆస్ట్రేయాకు చెందిన మరియ హియిర్ నిక్, డాక్టర్ మరియ, మరీ, ఇల్లియాస్, అంతోనియుస్, డాక్టర్ మగ్దలేనా ఆర్థిక సహాయంతో అ విచారణ గురువులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనాథలు, వితంతువులకు క్రిస్మస్,నూతన సంవత్సరం సందర్భంగా దుస్తులు పంపిణీ చేస్తున్నామన్నారు.

ఫిట్‌నెస్ అరేనా జిమ్ ప్రారంభం

ప్రజాశక్తి- కడప అర్బన్

నగరంలోని అప్సర సర్కిల్ సమీపంలో ఉన్న పివిఎస్ కాంప్లెక్స్ హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ పైన నూతనంగా ఏర్పాటు చేసిన 'ఐ/ఎన్ ఫిట్‌నెస్ అరేనా' జిమ్‌ను టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ మాధవి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేటి యువత శారీరక దృఢత్వంపై దృష్టి సారించాలన్నారు. ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి వ్యాయామం చాలా అవసరమని పేర్కొన్నారు. అధునాతన సౌకర్యాలతో జిమ్‌ను ఏర్పాటు చేసిన నిర్వాహకులు ఇంతియాజ్ ఖాన్ పఠాన్‌ను అభినందించారు. కార్యక్రమంలో నగర ప్రముఖులు పాల్గొన్నారు.

జిమ్ ప్రారంభోత్సవంలో శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యే మాధవి

చెత్తబుట్టలను పంపిణీ చేస్తున్న కౌన్సిలర్, ఎఇ

తడి, పొడి చెత్తలను వేరుగా వేయాలి

ప్రజాశక్తి -చాపాడు (మైదుకూరు)

ఇళ్లల్లోని తడి, పొడి చెత్తలను వేరుగా మైదుకూరు మున్సిపాలిటీ సిబ్బందికి అందజేయాలని వార్డు కౌన్సిలర్ ఎపి సుమలత సూచించారు. బుధవారం వార్డులోని ప్రజలకు ప్రభుత్వం తరుపున రెండు రకాల బుట్టలను పంపిణీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ తడి, పొడి చెత్తలకు రెండు రకాల బుట్టలు ఇచ్చారన్నారు. సిబ్బందికి వేరువేరుగా చెత్తను అందజేయడం వల్ల వారు సులభంగా వాటిని వేరు చేసుకునే అవకాశం ఉంటుందన్నారు. వ్యర్థ పదార్థాలను ఆరుబయట పడవేయకూడదన్నారు. వార్డు స్వచ్ఛతకు ప్రజల సహకరించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఎఇ నిరంజన్ రెడ్డి, సచివాలయ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

పింఛన్లు పంపిణీ అభినందనీయం

ప్రజాశక్తి - సింహాద్రిపురం

ఒక రోజు ముందుగానే ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్టీఆర్ సామాజిక భద్రత పెన్షన్లను పంపిణీ చేయడం ఎంతో అభినందనీయమని జిల్లా టిడిపి అధికార ప్రతినిధి లోమడ మురళీమోహన్ యాదవ్ పేర్కొన్నారు. మండలంలోని గురజాలలో బుధవారం ఆయన పెన్షన్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డిజిటల్ అసిస్టెంట్ పెద్దయ్య పాల్గొన్నారు.

అన్నదానం చేస్తున్న కానిస్టేబుల్ కుటుంబ సభ్యులు

అనాథ వృద్ధులకు అన్నదానం

ప్రజాశక్తి - వేంపల్లె

స్థానిక పాత గండి రోడ్డులో ఉన్న అమ్మ వృద్ధాశ్రమంలో అన్నదానం చేశారు. వేంపల్లెకు చెందిన పోలీసు కానిస్టేబుల్ సంగా రఘునాథ్, పవన్‌కుమార్ తండ్రి సంగా పుల్లయ్య 9వ వర్ధంతి సందర్భంగా బుధవారం మదర్ థెరిస్సా అనాథ ఆశ్రమంలో అన్నదానం చేపట్టారు. అన్నదానంతోపాటు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పుల్లయ్య సతీమణి సావిత్రి, కోడళ్లు హేమలత, లక్ష్మీప్రసన్న, మనవళ్లు తనుష్, అభీరా, దేవాన్స్, నందన్, మనవరాలు తన్విని పాల్గొన్నారు.

ఉపాధ్యాయురాలికి శుభాకాంక్షలు తెలుపుతున్న చిన్నారులు

ప్రభుత్వ పాఠశాలలో వేడుకలు

ప్రజాశక్తి - తొండూరు

మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో బుధవారం ముందస్తు నూతన సంవత్సరాన్ని పిల్లలు సంతోషంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా చిన్నారులు తమ ఉపాధ్యాయురాలికి పుష్పగుచ్ఛాలు అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. పిల్లలు చిరునవ్వులు, ముద్దుముద్దు అభినందనలు అక్కడి వాతావరణాన్ని మరింత ఉల్లాసంగా మార్చాయి. ఉపాధ్యాయురాలు విద్యార్థుల ప్రేమాభిమానాలకు కృతజ్ఞతలు తెలుపుతూ, వారికి మంచి భవిష్యత్తు ఉండాలని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో గురువుల పట్ల గౌరవం, ప్రేమ పెంపొందుతుందని పాఠశాల యాజమాన్యం తెలిపింది. నూతన సంవత్సర వేడుకలు చిన్నారుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపాయని పలువురు అభిప్రాయపడ్డారు.

పాటలకు నృత్యాలు చేస్తున్న విద్యార్థులు

శ్రీచైతన్య పాఠశాలలో ..

ప్రజాశక్తి - వేంపల్లె

వేంపల్లెలోని శ్రీచైతన్య పాఠశాలలో ముందస్తు నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు. బుధవారం పాఠశాల ఆవరణలో 2026 కొత్త సంవత్సర వేడుకల్లో భాగంగా కేక్ కట్ చేసి విద్యార్థులకు పంపిణీ చేశారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని, పాటలకు నృత్యాలు చేశారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ చక్రపాణిరెడ్డి మాట్లాడుతూ నూతన సంవత్సర వేడుకల్లో ప్రమాదాలు జరగకుండా ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. బైక్ రైడింగ్, ఫైర్ కాకర్స్, రాత్రి వేళ బయట తిరగడం వంటి విషయాల్లో తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు శ్రీచైతన్యరెడ్డి, చేతన్‌రెడ్డి, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో వేముల సర్పంచ్ మృతి

ప్రజాశక్తి - వేముల

రామాంజనమ్మ (ఫైల్)

వేముల సర్పంచ్ సాకే రామాంజనమ్మ (38) అనారోగ్యంతో బుధ వారం మధ్యాహ్నం పులివెందులలోని ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. రామాంజనమ్మ ఏడాది కాలంగా అనారోగ్యంతో బాధప డుతున్నారు. బుధవారం పరిస్థితి విషమించి ఆమె మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. గురువారం వేములలో రామాంజనమ్మ అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

గుంటి ప్రసాద్ మృతి బాధాకరం

ప్రజాశక్తి - వేంపల్లె రైల్వేకోడూరు మాజీ ఎమ్మెల్యే గుంటి ప్రసాద్ మృతి బాధాకరమని పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి పేర్కొన్నారు. బుధవారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ పాలనలో గుంటి ప్రసాద్ ఎమ్మెల్యేగా గెలుపొందారన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

భారీ గ్రావెల్ లారీలతో రోడ్లు గుల్ల

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలో గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణ పనులు జరుగుతుండడంతో లారీలు అధికంగా తిరుగుతున్నాయి. లారీలు అధిక గ్రావెల్ మట్టితో తిరుగుతుండడంతో రోడ్లు దెబ్బతింటున్నాయి. ముఖ్యంగా అల్లాడుపల్లె, వెదురూరు, ఆనందాశ్రమం, సిద్ధారెడ్డిపల్లె, బద్రిపల్లి గ్రామాల వద్ద ఆర్అండ్‌బి రోడ్లు బాగా దెబ్బతింటున్నాయి. పెద్దపెద్ద గుంతలు పడి వాహనదారులకు ప్రమాదకరంగా తయారయ్యాయి. గ్రావెల్ మట్టితో తిరిగే ట్రిప్పర్ లారీలు పరిమితికి మించి నిత్యం రాకపోకలు సాగిస్తున్నాయి. పర్యవేక్షించాల్సిన అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదు. ద్విచక్ర వాహనాల్లో, కార్లలో ప్రయాణించే వారు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఏడాది తిరక్కుండానే ఆర్అండ్‌బి రోడ్లు దెబ్బతింటున్నాయి. అల్లాడుపల్లె దేవళాలు వద్ద పెద్ద గుంత ఏర్పడి ఇబ్బందికరంగా మారింది. అల్లాడుపల్లె, నక్కలదిన్నె రోడ్డు చాలావరకు దెబ్బతిని ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అధిక లోడుతో వెళుతున్న లారీలను అదుపు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

అల్లాడుపల్లె ఆర్చ్ వద్ద దెబ్బతిన్న రోడ్డు

కొత్త పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

రీ సర్వే జరిగిన గ్రామాల్లో కొత్త పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ చేస్తామని ఆర్డీవో చిన్నయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2019-2024 మధ్య కాలంలో రాష్ట్రంలో నూతనంగా భూముల రీ-సర్వే జరిగిందన్నారు. పులివెందుల డివిజన్ పరిధిలో ఈనెల 2నుంచి 9వ తేదీ వరకు కొత్తగా మంజూరైన పట్టాదారు పాసుపుస్తకాలు పంపిణీ చేస్తా మన్నారు. పులివెందుల మండలంలో రాగిమానుపల్లె, రచ్చుమర్రిపల్లె, కనంపల్లె, లింగాల మండలంలోని హిరోజీపురం, నరసింగరావుపల్లె, రామనూతులపల్లి, సింహాద్రిపురంలో దేవతాపురం, జంగంరెడ్డిపల్లె, తెలికి, హిమకుంట్ల, సింహాద్రిపురం, నిడివేల, తొండూరులో సైదాపురం, జాలపర్తి, వేములలో పెండ్లూరు, వేంపల్లెలో ముతుకూరు, చక్రాయపేటలో నర్సుపల్లి, గొట్లమిట్ట, కొండప్పగారిపల్లి, కుమారకాల్వ, మహాదేవపల్లి, అద్దాలమర్రి, ఆంజనేయపురం, వీరపునాయని పల్లిలో అయ్యవారిపల్లి, పిల్లివారిపల్లి, తలపనూరు, కీర్తిపల్లి, లింగాల, గోనమాకులపల్లి, తంగేడు పల్లి, అంకిరెడ్డిపల్లి, వెల్దుర్తి గ్రామాల్లో రీ-సర్వే పూర్తయినందున ఆయా గ్రామాల్లో పట్టాదారులకు భూముల సంబంధించి కొత్త పట్టాదారు పాసుపుస్తకాలు మంజూరు అవుతాయన్నారు. రైతులు పాత పట్టాదారు పుస్తకాలు తీసుకువచ్చి కొత్త పుస్తకాలు తీసుకోవాలని ఆర్డీఓ కోరారు.

పులివెందుల రూరల్ : ఈ నెల 2, 3న రాగిమానుపల్లె గ్రామ సచివాలయం, 6, 7న రచ్చుమర్రిపల్లి శ్రీరామాలయం, 8, 9న కనంపల్లె ఎంపిపి స్కూల్ వద్ద రీ సర్వే పూర్తయిన గ్రామాలకు సంబంధించి కొత్త పాసుపుస్తకాలు ఇస్తామని తహశీల్దార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు పాత పాసు పుస్తకాలు ఇచ్చి, వాటి స్థానంలో కొత్తవి తీసుకెళ్లాలని ఆయన కోరారు. ఆయా కార్యక్రమాలకు రైతులు సహకరించాలని కోరారు.

చాపాడు : జనవరి 2 నుంచి గ్రామాల్లో రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలు పంపిణీ చేస్తున్నట్లు తహశీల్దార్ రమాకుమారి తెలిపారు. ప్రతిరోజు రెండు గ్రామాల్లో ఉదయం, మధ్యాహ్నం వేళల్లో సభను నిర్వహిస్తామన్నారు. 2న వెంగన్నగారి పల్లి, చాపాడు, 3న అనంతపురం, తుమ్మలపాడు, 5న చిన్న గురువలూరు, కుచ్చుపాప, 6న బూడిదపాడు, 7న అల్లాడుపల్లి, 8న భద్రిపల్లి, వెదురూరు గ్రామాల పరిధిలో పాసుపుస్తకాలు పంపిణీ చేస్తామన్నారు. సభలను గ్రామ సచివాలయ భవనాల్లో ఏర్పాటు చేస్తామన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

కొత్త ఏడాదిలో ఉత్సాహంగా పరిపాలన అందిస్తాం

మాట్లాడుతున్న టిడిపి జిల్లా అధ్యక్షులు భూపేష్‌రెడ్డి

జమ్మలమడుగు : 2025 సంవత్సరం కన్నా 2026లో ఉత్సాహంగా పరిపాలన అందిస్తామని, ప్రజలకు సేవ చేస్తానని, ప్రతి ఒక్క కార్యకర్తకు అందు బాటులో ఉంటానని టిడిపి జిల్లా అధ్యక్షుడు సి.భూపేష్ సుబ్బరామిరెడ్డి పేర్కొన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో బుధవారం కూటమి ప్రభుత్వం విజయాలపై మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కడప జిల్లా తెలుగుదేశం పార్టీ నాయకులకు, కార్య కర్తలకు ముందుగా నూతన సంవత్సరం, సంక్రాంతి శుభాకాంక్షలు తెలి పారు. పార్టీ జాతీయ అధ్యక్షులు, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయక త్వాన్ని, తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి మంత్రి నారా లోకేష్ బాబు నాయకత్వాన్ని బలపరుస్తామన్నారు. జిల్లాలో తెలుగుదేశం పార్టీకి పూర్వవైభవం తెస్తానని, నాయకుడిగా కాకుండా సేవకుడిగా పని చేస్తానన్నారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి రమణారెడ్డి, మార్కెట్ యార్డ్ చైర్మన్ నాగేశ్వర్‌రెడ్డి, కడప జిల్లా తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు శ్రీనివాసులు, కర్నాటి రామాంజనేయులు రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ మల్లికార్జున, మహబూబ్ బాషా, ఫిలిప్, సంతోష్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మూడు రోజుల్లో రైతు ఖాతాలో నగదు జమ

ప్రజాశక్తి - దువ్వూరు

వరి ధాన్యం కొనుగోలు చేసిన మూడు రోజుల్లో ఆయా రైతు ఖాతాల్లో నగదు జమ అవుతుందని జిల్లా సివిల్ సప్లయ్ అధికారి నాగసుధ తెలిపారు. మండలంలోని రెండు వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో బుధవారం ఆమె తనిఖీ చేశారు. క్షేత్రస్థాయిలో వరి ధాన్యం కొనుగోలుకు ఏమైనా ఇబ్బందులు ఉన్నాయ అనీ రైతులతో ఆరా తీశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ తేమశాతం 17 ఉంటే రైతు దగ్గర కొనుగోలు చేస్తామన్నారు. రవాణా, గోనె సంచులు, హమాలీ ఖర్చులు ప్రభుత్వమే భరిస్తుందన్నారు. ప్రభుత్వ మద్దతు ధరతో క్వింటా రూ.2,389తో కొనుగోలు చేస్తున్నామని తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ బిజినెస్ మేనేజర్ ఖాదరవల్లి, అసిస్టెంట్ బిజినెస్ మేనేజర్ రఘు, మండల వ్యవసాయ అధికారి అమర్నాథరెడ్డి, వ్యవసాయ విస్తరణ అధికారులు కాంతమ్మ, చరణ్, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రంలో ధాన్యం తూకం తనిఖీ చేస్తున్న నాగసుధ

ఎస్‌సి, ఎస్‌టి హక్కులను పరిరక్షిద్దాం

ప్రజాశక్తి-రామాపురం

సమాజంలో ఎస్‌సి, ఎస్‌టి హక్కులను అధికారులు నాయకులు తమ పరిధిలో పరిరక్షించాల్సిన బాధ్యత ఎంతైనా ఉందని తహశీల్దార్ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. మండలంలోని రాచపల్లిపంచాయతీ బీదవాళ్లపల్లి దళితవాడలో బుధవారం ఎస్‌సి, ఎస్‌టి జిల్లా మానిటరింగ్ కమిటీ సభ్యుడు జి.వెంకటరమణ ఆధ్వర్యంలో పౌర హక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్‌సి, ఎస్‌టిలను సమాజంలో తక్కువ చేసి చూస్తే కఠినమైన చట్టాలు ఉన్నాయన్నారు. భారతదేశానికి స్వాతంత్ర లభించి 70 సంవత్సరాలు దాటుతున్న గ్రామాలలో అక్కడక్కడ అంటరానితనం కనిపిస్తూనే ఉందన్నారు. దీనికి ప్రధాన కారణం ఎస్‌సి, ఎస్‌టిలలో అవగాహన లోపించడమేనన్నారు. తమ పిల్లలు ఉన్నత చదువులు చదివి ఉన్నతస్థాయిలో ఉన్న పుడే ఎలాంటి అస్పృ స్టులకు తావుండదన్నారు. వెంకటరమణ మాట్లాడుతూ డాక్టర్ బి.ఆర్‌అంబేద్కర్ సమాజంలోని అస్ప ృశ్యతను పోగొట్టడానికి రాజ్యాంగంలో ఎస్‌సి, ఎస్‌టిలకు ప్రత్యేకమైన హక్కులను చట్టాలను రిజర్వేషన్లను రచించారని పేర్కొన్నారు. వాటిని అందిపుచ్చుకొని ఎస్‌సి, ఎస్‌టిలు ఎదగాలన్నారు. గ్రామాల్లో అగ్ర వర్ణాల నుంచి దౌర్జన్యాలు దాడులు లాంటివి జరిగినప్పుడు కాని ఎలాంటి సమస్యలు ఉన్న తమ దృష్టికి తీసుకొస్తే అధికారులతో మాట్లాడే తమ వంతు సమస్యలు పరిష్కారానికి సహాయ పడతామన్నారు. ఈ గ్రామంలో తాగునీరులో ఫ్లోరైడ్ శాతం ఎక్కువ ఉన్నదని శ్మశాన వాటిక సమస్య ఉందని గ్రామస్తులు సభ దృష్టి తెచ్చారన్నారు. ఈ సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకుపోతామని ఆయన అన్నారు. సమావేశంలో ఎంఇఒక్కో2 జైచంద్రుడు, ఆర్ఐ సమ్మద్‌ఖాన్, విఆర్‌ఒ యగ్నేష్, టిడిపి నాయకులు భాస్కర్‌నాయుడు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

పబ్లిక్ మరుగుదొడ్లకు మరమ్మతులు

ప్రజాశక్తి-చిట్వేలి

ప్రభుత్వ కార్యాలయాల సముదాయంలో ఉన్నటువంటి పంచాయతీ పబ్లిక్ మరుగుదొడ్లు గ్రామ ఉప సర్పంచ్ చౌడవరం ఉమామహేశ్వర్‌రెడ్డి ఆధ్వ ర్యంలో 15వ ఆర్థిక సంఘం నిధులతో మరమ్మతులు చేయించినట్లు తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాల సముదాయంలోనే కాకుండా దూర ప్రాంతాల నుంచి ప్రయాణించే ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా త్వరితగతిన మరమ్మతులు నిర్వహించడం జరిగిందన్నారు. ఎలాంటి రుసుం లేకుండా వినియోగించుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యాలయ సిబ్బంది కో-ఆప్షన్ సభ్యుడు అన్సర్‌బాష, కస్తూరి మని, హజరత్‌రెడ్డి పాల్గొన్నారు.

క్రీడలు మనోధైర్యాన్ని పెంపొందిస్తాయి

ప్రజాశక్తి-నందలూరు

క్రీడలు మనోధైర్యాన్ని, శారీరక ధృడత్వాని పెంపొందిస్తాయని విశ్రాంత రైల్వేస్టేషన్ మేనేజర్ ఆనంద్‌కుమార్, లోకో పైలెట్ కమాల్‌బాషా పేర్కొన్నారు. స్వర్ణాంధ్ర మదర్‌ల్యాండ్ విక్టరీ స్కౌట్ గ్రూప్ 27వ వార్షికోత్సవం సందర్భంగా ఆ సంస్థ అధ్యక్షులు వేపగుంట శ్యామ్‌రాజ్ ఆధ్వర్యంలో స్థానిక జడ్‌పి హైస్కూల్ క్రీడా మైదానంలో బుధవారం కబడ్డీ పోటీలు ప్రారంభించారు. కార్యక్రమంలో రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ కార్యదర్శి రవికుమార్, రైల్వే ఎలక్ట్రిక్ ఉద్యోగి రాజేష్, సీనియర్ క్రీడాకారులు బూదెల ప్రభాకర్, పల్లె గ్రీష్మంత్‌రెడ్డి, స్కౌట్ సభ్యులు పెంచలయ్య, అభిషేక్, హర్ష అమృతరాజ్, రూపేష్; జయకుమార్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే ప్రజాదర్బార్ :'ముక్కా'

ప్రజాశక్తి- రైల్వేకోడూరు

నియోజకవర్గంలోని ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రజా దర్బార్ నిర్వహిస్తున్నామని టిడిపి ఇన్‌ఛార్జి, కుడా చైర్మన్ ముక్కా రూపానంద రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని రాఘవ రాజుపురం టిడిపి కార్యాలయంలో బుధ వారం ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. నియోజకవర్గానికి చెందిన ప్రజలు తమ సమస్యలను నేరుగా రూపానంద రెడ్డి దృష్టికి తీసుకువచ్చారు. వారి సమస్యలను శ్రద్ధగా విన్న ఆయన సం బంధిత అధికారులతో మాట్లాడి వీలైనంత త్వరగా పరిష్కార చర్యలు తీసు కుంటామని హామీనిచ్చారు. అనంతరం ఆయన మాట్లా డుతూ ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించడమే ప్రజా దర్బార్ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. కూటమి ప్రభుత్వం ప్రజలకు ఎల్లప్పుడూ అందు బాటులో ఉండేలా పనిచేస్తుందని తెలిపారు. ప్రజల నుంచి వచ్చిన వినతు లను నిర్లక్ష్యం చేయకుండా వారు సంతృప్తి చెందేలా పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులకు రైటింగ్ ప్యాడ్స్ వితరణ

పరీక్ష ప్యాడ్లతో విద్యార్థులు, దాతలు, ఉపాధ్యాయులు

తొండూరు : రేనాటి చంద్రుడు, అపర దానకర్ణుడు బుడ్డా వెంగల్‌రెడ్డి వర్ధంతి సందర్భంగా దీనబంధు వికలాంగుల సేవా సమితి అధ్యక్షుడు జనార్ధన్‌రెడ్డి బుధవారం తొండూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు రైటింగ్ ప్యాడ్స్ పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువులో ఉత్తమ ఫలితాలు సాధించి ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. రానున్న పదవ తరగతి పరీక్షల ఫలితాల్లో మొదటి మూడు స్థానాల్లో నిలిచే విద్యార్థులకు రూ.10,000 నగదు బహుమతి అందజేస్తామని ప్రకటించారు. ఎంఇఒ శివప్రసాద్ మాట్లాడుతూ దాతల సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రధానోపాధ్యాయులు సుబ్బారెడ్డి మాట్లాడుతూ జనార్ధన్‌రెడ్డి వంటి దాతలు పాఠశాల విద్యార్థులకు చేస్తున్న సేవలు వెలకట్టలేనివని కొనియాడారు. భవిష్యత్తులో మరికొందరు దాతలు ముందుకు వచ్చి పాఠశాల అభివృద్ధికి తోడ్పడాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నినాదాలు చేస్తున్న కాంట్రాక్ట్ గెస్ట్ ఫ్యాకల్టీలు

నేడు కాంట్రాక్ట్ టీచింగ్ గెస్ట్ ఫ్యాకల్టీల నిరసన

ప్రజాశక్తి - వేంపల్లె

ఆర్‌జెయుకెటి పరిధిలోని ట్రిపుల్‌ఐటిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ టీచింగ్ గెస్ట్ ఫ్యాకల్టీల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గురువారం నిరసన చేపట్టనున్నట్లు ఆ యూనియన్ నాయకులు నజీర్ హుస్సేన్ తెలిపారు. ఆ మేరకు బుధవారం ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటి డైరెక్టర్ కుమారస్వామి గుప్తాను కలిసి నోటీసు ఇచ్చారు. కాంట్రాక్ట్ గెస్ట్ ఫ్యాకల్టీల సమస్యలను పరిష్కరించాలని పలుమార్లు వినతిపత్రాలిచ్చినా ప్రయోజనం లేకపోవడంతో, నిరసన చేపడుతున్నామని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంట్రాక్ట్ గెస్ట్ ఫ్యాకల్టీలు మణికిరణ్, దేవిక, శ్రావణి, అశ్వనితోపాటు పలువురు పాల్గొన్నారు.

లక్ష్మీదేవిని సన్మానిస్తున్న వైద్య సిబ్బంది

పిహెచ్‌ఎన్ లక్ష్మీదేవికి ఘన సన్మానం

ప్రజాశక్తి - చక్రాయపేట

మండలంలోని సురభి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పబ్లిక హెల్త్ నర్సుగా పనిచేస్తున్న కె.లక్ష్మీదేవిని బుధవారం ఘనంగా సన్మానించారు. ఆమె ఉద్యోగ విరమణ చేయడంలో సురభి పిహెచ్‌సి సిబ్బంది ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా డిప్యూటీ డిఎంహెచ్‌ఒ ఖాజామొద్దీన్ మాట్లాడుతూ లక్ష్మీదేవి తొమ్మిదేళ్లుగా ఇక్కడ పనిచేస్తూ ఎన్నో సేవలను అందించారన్నారు. వైద్య సిబ్బంది, బంధువులు ఆమెను ఘనంగా సన్మానించారు. డాక్టర్ శివ ప్రసాద్, డాక్టర్ వాణి, ఎంపిహెచ్‌ఒలు పి.రామకృష్ణ, సుకుమార్, సిహెచ్‌ఒ వెంకట్రామిరెడ్డి, కంటి పరీక్ష అధికారి రెడ్డన్న, సబ్ యూనిట్ అధికారి సిద్దయ్య, హెల్త్ మిల్ అసిస్టెంట్ వెంగయ్య, సీనియర్ అసిస్టెంట్లు నరేష్, ఫైరోజ్ పాల్గొన్నారు.

పాటను ఎస్‌పికి అందజేస్తున్న రచయిత వెంకటేశ్వరరెడ్డి

సమాజాన్ని మేల్కొల్పడంలో రచయితల పాత్ర గొప్పది

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

సమాజాన్ని మేల్కొల్పడంలో రచయితల పాత్ర గొప్పదని ఎస్‌పి షెల్కే నచికేత్ విశ్వనాథ్ పేర్కొన్నారు. ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత గజ్జల వెంకటేశ్వరరెడ్డి స్వయంగా రచించి, గానం చేసిన మన కడప ఘన కడప గీతాన్ని బుధవారం స్వయంగా ఎస్‌పికి అందజేశారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ ఈ పాటలో కడప జిల్లా సమగ్ర సమాచారం ఉందన్నారు. ఈ పాటకు సంబంధించి పది వేల ప్రతులను ముద్రించేందుకు సహకరించిన పోతిరెడ్డి మురళినాగిరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, బసిరెడ్డి ప్రసాద్‌రెడ్డి, గుండ్రు వెంకట సుబ్బారెడ్డిని ఎస్‌పి అభినందించారు. అనంతరం రచయిత వెంకటేశ్వరరెడ్డిని ఎస్‌పి ఘనంగా సన్మానించారు.

మౌలిక వసతుల కల్పనే లక్ష్యం

ప్రజాశక్తి-పుల్లంపేట

మౌలిక వసతుల కల్పనే తన లక్ష్యమని రెడ్డిపల్లె సర్పంచ్ ఎల్లయ్య అన్నారు. బుధవారం రెడ్డిపల్లె గ్రామ పంచాయతీలో వీధిలైట్లు మరమ్మతులు చేపట్టారు. మరమ్మతులతో పాటు ప్రతి వీధిలో అవసరమైన చోట కొత్త ఎల్ఇడి దీపాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ నూతన సంవత్సరం, సంక్రాంతి పండుగ సందర్భంగా గ్రామ విధులలో విద్యుద్దీపాల సమస్య తన దృష్టికి రావడంతో వెంటనే మరమ్మత్తులతో పాటు కొత్త లైట్లు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. వీధి లేకపోవడం వలన ప్రజలు విషపురుగుల బారిన పడటంతో పాటు దొంగలు బెడద కూడా ఉంటుందన్నారు. గ్రామపంచాయతీలో ఎటువంటి సమస్య ఉన్న తమ దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరిం చేందుకు కృషి చేస్తామని తెలిపారు. ప్రజలకు మౌలిక వసతులు కల్పించి పంచాయితీని అభివృద్ధి బాటలో నడిపించేందుకు అన్ని విధాల కృషి చేయడం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

30 శాతం ఐఆర్ ప్రకటించాలి

ప్రజాశక్తి-రామాపురం

కూటమి ప్రభుత్వం ఏర్పడి 18 నెలలు దాటుతున్న ఎన్నికల సమయంలో ఉద్యోగస్తులకు ఇచ్చిన హామీ12వ పిఆర్‌సి కమిషన్ 30శాతం ఐఆర్ ప్రకటించాలని పిఎస్‌టియు రాష్ట్ర మైనార్టీ కన్వీనర్ సయ్యద్ ముజురుల్ హుక్ డిమాండ్ చేశారు. మండలంలోని నీలకంఠరావుపేట జడ్‌పిహైస్కూల్(తెలుగు) (ఉర్దూ)పాఠశాల ఆవరణంలో బుధవారం పాఠశాలల ప్రధానో పాధ్యాయులు వనజ రెడ్డి మహమ్మద్‌ఇలాల్‌తో కలిసి పిఎస్‌టియు డైరీ కేలండర్, స్టిక్కర్లను ఆవిష్క రించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం మేనిఫెస్టోలో పెట్టిన విధంగా 12వ పిఆర్‌సి 30శాతం ఐఆర్ ఇస్తామని ప్రకటించిన హామీని అమలు పరచాలన్నారు. ఉద్యోగులు ఉపాధ్యా యులు ప్రభుత్వం అమలు దొరుకుతుందని ఎదురుచూస్తున్నారని త్వరగా అమలుపరిచి హామీని నిలుపుకోవాలన్నారు. ఈ సమావేశంలో రెండు పాఠశాలల పిఇటిలు సతీష్‌రెడ్డి సన్నావుల్లా ఉపాధ్యా యులు శ్యాం సుందర్, గౌస్‌పీర్, మహబూబ్‌బాషా, యూనిస్ పాల్గొన్నారు.

మహారాజశ్రీ ప్రొద్దుటూరు సీనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో

O.S.No. 173/2011

Koneti Mohan Reddy, S/o Narasimha Reddy, aged 55 years, Business residing at D/No.22/152, Vasanthapeta, Proddatur town and Mandal, Kadapa District. **...Plaintiff**

Vs

D5. P.Ramulamma, W/o Chandra Sekhar, Hindu, residing at D.No.2/270, Upstairs, Kesanna Satram Street, Proddatur Town.

D6.N.Bhaskar Reddy, S/o Veera Reddy, aged 44 years, Business.

D7.N.Praveen Kumar Reddy, S/o Bhaskar Reddy, aged 28 years.

D8.N.Mounika, D/o Bhaskar Reddy, aged 30 years, Hindu.

D6 to D8 are residing at D.No.9/255, Sreeramulapeta, Proddatur Town and Mandal, Kadapa District.

...Defendants D5 to D8

దావా సమన్లు

పై నెంబరు దావాలో వాది, 2వ ప్రతివాది అయిన జి.వెంకటసుబ్బారెడ్డి పై దావా దాఖలు చేసి ఉన్నారు. అట్టి దావా యందు 2వ ప్రతివాది గతించినందున అతని వారసులుగా దావా యందు D5 to D8 ప్రతివాదులు అయిన మిమ్ములను చేర్చి ఉన్నారు. అట్టి దావాలో మీకు ఆక్షేపణలు ఉన్న ఎడల 7.1.2026వ తేదీన పై కోర్టు యందు ఉదయం 10.30 ని॥లకు హాజరు కావలెయును. లేనంతట పరోక్షముగా తీర్మానించబడును.

వాయిదా తేది: 7.1.2026

//కోర్టు వారి ఉత్తర్వు మేరకు//

C.SYAMA SUNDARA REDDY
Advocate,
PRODDATUR.